

# చల్లనియండ

'పి.ఎస్.నారాయణ'

"సుందరం!"

తలుపుతీసి ఎవరా అని చూచిన వరలక్షుమ్మగారి నోటివెంట ఆ మాటతప్ప మరోటి రాలేదు. నిర్ఘాంతపోయింది. నిర్లిప్తి అయిపోయింది.

"....నాపేరు సుందరం కాదు వదినా!.... సుందరి!..." తియ్యగా నవ్వింది. "అయితే ఇంటికొచ్చిన మనిషిని ఆహ్వానించే పద్ధతి ఇలాగేనన్నమాట!... మా నాన్నగారి కాలంలో ఇంట్లో అతిథి కాలు పెట్టటం ఆలస్యం ఇంట్లోని వ్యక్తులంతా గుర్రాలమీద కాళ్లు పెట్టవల్సిందే....క్షణాలమీద ఆ అతిథిగారి నోట్లో ఇన్ని వేన్నీళ్లు పడవల్సిందే!... పోనీయ్ ఆయనగారి పెద్దకొడుకు పెత్తనంలో ఆలాంటిదేవీ లేకపోయినా గడపలో కాలు పెట్టిన వాళ్లను లోపలికైనా రానీయకుండా రెండు చేతులూ తలుపు మీదే ఉంచి దారి కడ్డంగా నిలబడటమా? అవ్వ!......"

"సుందరం! ఇది ఎగతాళికి, అవహేళనకు సమయంకాదు!.....మీ అన్నయ్య వచ్చే వేళైంది!....." అన్నది గొణుగుతున్నట్లుగా, భయంభయంగా బయట ఎండకేసిచూస్తూ.

ఆ మాటకు సుందరి మొఖం నల్లబడిపోయింది. తడబడే కంఠంతో "క్షమించు వదినా!.....ఒక్క క్షణం......ఒక్కమాట.... ఒక్కసారి లోపలకు రానీయ్ వదినా!" అన్నది. కంట్లో నీరు గిర్రున తిరిగింది.

పదిహేను సంవత్సరాలు తన కన్న కూతురిలా మెలిగిన సుందరం కోరికను తిరస్కరించలేకపోయింది ఆమె. గుండె భయంతో గుబులు గుబులుమంటున్నా, తలుపులమీద వున్న రెండు చేతులనూ తీసి వెనుదిరిగింది.

సుందరి అడుగు ముందుకువేసి తలుపులు బంధించి వడి వడిగా వదినను—తల్లిలాంటి వదినను అనుసరించింది.

"చెప్పు!"

"చెప్పేందుకు ఏమున్నది వదినా!.... ఇదుగో ఇటుచూడు......ఈ చిన్న సూట్ కేస్ పెట్టెను అన్నయ్య రాగానే ఇవ్వు! అంతే! అదే నా కోరిక!" అన్నది దృఢంగా తను ఇరవైరెండు సంవత్సరాలు మెలిగిన ఆ గృహంలో ఈనాడు ఏదో కొత్తదనంతో గూడిన తడబాటుతో పరిసరాలు పరిశీలిస్తూ.

"ఈ కుటుంబం ఇలా ఉండటం గూడా నీకు ఇష్టం లేదన్నమాట!" గొంతు కర్కశంగా ఉన్నది.

"వదినా!" బాధతో మూలిగింది సుందరి.

"మరేవిటి?...... ఆయన రాగానే—ఇదుగో మీ చెల్లెలు సుందరంవచ్చి, ఇది మీకోసరం ఇచ్చివెళ్లిందంటూ ఇస్తే—ఇక నేను బ్రతికి ఉంటాననే నీ ఉద్దేశ్యమా?..... నిన్ను నేను లోపలికి రానిచ్చానని తెలిస్తే నా ప్రాణాలు పోయేలా మీ అన్నయ్య కొడతారని నీకు తెలియదా సుందరం?" ఆమె తెల్లబడిపోయిన మొఖాన్ని చూస్తుంటే సుందరికి నోటివెంట మాట పెగల్లేదు.

"వదినా!"

"......ఏదో కలో గంజో త్రాగుతూ ఇలా బ్రతికి ఏడుస్తున్నాం.....ఈ కాస్త సుఖం గూడా మానుండి దూరం చేయబోకమ్మా సుందరం.....బతిమలాడుతున్నాను! రెండు చేతులు జోడించి అంటున్న ఆమెను

చూస్తుంటే సుందరి ఏడుపు ఆపుకోలేకపోయింది.

"వదినా!.....నేను పాపిష్ఠి దాన్ని వదినా!.. కాదనను....నన్ను క్షమించు......కాని నా ఈ చిన్న కోరికను మాత్రం కాదనకు వదినా!" అన్నది తడబడే కంఠంతో.

వాకిటి తలుపు చప్పుడయింది.

వరలక్ష్మమ్మగారి మొఖం మరింత తెల్లబడిపోగా, "సుందరం!...అరుగో మీ అన్నయ్య వచ్చారు ...... దొడ్డివైపు తలుపుగుండా వెంటనే వెళ్లిపో....మీ వదిన ఇంకా ఈ భూమ్మీద బ్రతికిఉండాలనుకుంటే నీవు వెళ్లిపో సుందరం!" అన్నది.

సుందరి తడబడింది.

చటుక్కున చేతిలోని పెట్టెను నేలమీద పెట్టేసి వణుకుతున్న కాళ్లతో వెనుక వాకిలివైపుకు పరుగెత్తింది.

"సుందరం!....ఈ పెట్టె తీసుకుపో!" ఏడుపును దిగమ్రింగుకుంటూ అన్నది వరలక్ష్మమ్మగారు.

పోతున్నదల్లా సుందరి ఒక్కక్షణం ఆగి, వెనుదిరిగి రెండు చేతులూ జోడించి నమస్కరిస్తూ, "నన్ను క్షమించు వదినా!..... నేను దానిని తిరిగి తీసుకు వెళ్లేందుకుగాను తీసుకురాలేదు...... ఇది అన్నయ్యకోసరం తెచ్చాను......అది అన్నయ్యకే ఇవ్వు........ వస్తాను!" అని క్షణంలో వాకిలి తీసుకొని గడపదాటి తలుపు మూసేసింది.

వరలక్ష్మమ్మగారు ఎవరో నెత్తిన బాదినట్లనిపించగా విలవిల లాడిపోయింది. ఇంటి వాకిటి తలుపుమీద దబ దబా కొడుతూనే ఉన్నారాయన.

తలుపుతీస్తే— లోపలికివచ్చి— సంగతి తెలుసుకొని తననీ అలాగే బాదుతారని తనకు తెలుసు!

కాని—తనేం చేస్తుంది? తనేం చేయగలదు?

ఇదంతా తన ఖర్మ!

"వరలక్ష్మీ"

వణుకుతున్న కాళ్లతో వెళ్లి తలుపు తీసింది.

సన్నగా, పీలగా, రేగుతున్న జుట్టుతో శుష్క భర్త గుంటలుపడ్డ కళ్లలోకి ఒక్కసారి చూచి వెనుదిరిగింది.

నాలుగు అడుగులు లోపలికి వేసిన తరువాత "వరలక్ష్మీ! ఎవరితోటి మాట్లాడుతున్నావ్?......అంత నా పిలుపు గూడా వినిపించుకోకుండా!" చిన్నగా నవ్వి అన్నారాయన.

ఆమె మాట్లాడలేదు. మొఖం వెనక్కైనా తిప్పలేదు. ఆమెకంటివెంట కారుతున్న నీరు మొఖాన్ని వెనక్కు తిప్పనీయలేదు.

ఆ ఇద్దరూ హాల్లోకి వచ్చారు.

వడి వడిగా నాలు గడుగులు వంట ఇంట్లోకి వేయబోతూ, వెనక్కు తిరక్కుండానే, "మీ చెల్లెలు సుందరం వచ్చింది!.... ఈ చిన్న సూట్‌కేసు పెట్టెను మీ కివ్వమని ఇక్కడ పెట్టివెళ్లింది!" గంభీరంగా అని మరోక్షణంలోనే వంటఇంట్లోకి వెళ్లిపోయింది.

"వరలక్ష్మీ!" ఆ కంఠం ఆ గృహంలో పిడుగుపడుతున్నట్లే ఉన్నది.

"వరలక్ష్మీ! ఏమన్నావ్?.....సుందరం వచ్చిందా?......ఎందుకు రానిచ్చావ్ లోపలికి?.......ఆ సిగ్గులేనిదాన్ని లోపల ఎందుకు కాలుపెట్టనిచ్చావు వరలక్ష్మీ?" ఆయన కళ్లు నిప్పులుకురిపించసాగినయి. "ఏనాడైతే ఆదౌర్భాగ్యుడితో లేచిపోయిందో ఆనాటి నుండీ అది నా గడపను తొక్కే హక్కు పోగొట్టుకున్నదని నీకు తెలియదా వరలక్ష్మీ"

వంట ఇల్లు నిశ్శబ్దంగా ఉన్నది.

మనిషి బిగుసుకుపోయి, శరీరం ఆవిర్లు తేలుతుండగా ముందుకు అడుగులు వేశారు ఆయన. నేలమీదకువంగి, "దీంట్లో ఏం పెట్టింది?......మనని తినమని ఇంత విషమా?" అంటూ మూతతీసి నిశ్చేష్టులయ్యారు!

కళ్లు తిరగసాగినయి.

డబ్బు!!

—అన్నీ కొత్త పది రూపాయిల నోట్ల కట్టలు!!

* * *

ఐదు సంవత్సరాల క్రితంమాట—

గుండె జబ్బుతో బాధపడే తనకు సంపాదించుకునే యాభై రాళ్లను గూడా ప్రస్తుతానికి నిలుపుచేసి, విశ్రాంతి తీసుకోమని డాక్టరు సలహా ఇచ్చిన నాటిమాట—

జీవితావసరాలు తీర్చుకోవటమే గగనకుసుమాలవుతుండగా లోలోని దిగుళ్లతో గుండె జబ్బు వేళ్లు పాతుకుపోతున్ననాటి మాట—

"మీకు మనియార్డరు వచ్చిందిసార్!"

వరండాలో గతాన్ని తవ్వుకుంటూ కాలాన్ని కరిగిస్తున్న సమయంలో పోస్టుమన్ మాటలు వినిపించినయి.

తనలో అసహ్యాన్ని, అపోహని క్రుమ్మరించి పారిపోయిన తమ్ముడు— తన సర్వస్వాన్ని ధారపోసి విద్యావంతుడిగా చేసిన తమ్ముడు—తనలోని బలహీనతకు నవ్వుతూ పంపిన మనియార్డరు!

వణికే చేతులతో సంతకంపెట్టి తీసుకున్నాడు.

"సుందరం!"

"వస్తున్నా నన్నయ్యా!" మనిషి ఎంత అందంగా ఉంటుందో మాట అంత తియ్యగా ఉంటుంది.

"ప్రకాశం డబ్బు పంపాడమ్మా! దాచు!" అందించాడు కుర్చీ పక్క నిలబడ్డ చెల్లెలికి.

"ఏమని వ్రాశాడు?"

"ఏముంది వ్రాయటానికి—పండ్లు తినమన్నాడు. దిగులుతో పండిపోవద్దన్నాడు— కళ్లల్లో మన మెంతా మెదులుతున్నామన్నాడు......అవసరముంటే మరింత డబ్బు పంపుతా నన్నాడు!"

కళ్లు కృతజ్ఞతతో మెరిసినయి.

అలాంటివాడినేనా ఒకనాడు తను 'ద్రోహి' అని నిందించింది?

అవును!

తన అనారోగ్యాన్ని గూడా లెక్క చేయకుండా రాత్రింబవళ్లూ ట్యూషన్లు చెప్పి, నెత్తురోడ్చి సంపాదించిన డబ్బుతో చదువు చెప్పించి, పట్టభద్రుణ్ణి చేస్తే—తనకు చెప్పకుండా, తనకు ఆసరాగా ఉండకుండా తను గుండెజబ్బుతో విలవిల లాడుతుంటే—తనను విధికి వదిలివేసి—'అధిక సంపాదన' కంటూ అన్ని వందల మైళ్లదూరం పారిపోతాడా...? ఇదంతా తను అనుకున్నాడు!

కాని రెండు నెలలైనా తిరక్కముందే మొదలుపెట్టి ఈనాటివరకు ఆగకుండా నెల నెలా వచ్చే మనియార్డర్లు, తనవన్నీ అపోహలే అని నిరూపించినయి!

తమ్ముడు మొదటిసారిగా డబ్బు పంపుతూ, వెళ్లగ్రక్కుకున్న వేదనను తను ఆలస్యంగానే అర్థం చేసుకోగలిగాడు.

"అన్నయ్యా!

నీ మనస్సుకు అమితమైన వేదనను కలిగించేదైనా నేనీ పని చేయక తప్పలేదన్నయ్యా. మన వూళ్లోనే ఇల్లు వదలకుండా ఉంటే నేను సంపాదించ గలిగేదెంత?......నా చేతిలో వున్న డిగ్రీ నీకన్నా ఒక ఇరవై రూపాయలు ఎక్కువ సంపాదించగలుగుతుందేమో?

అందుకే ధైర్యం చేసి—నీకు కష్టం కలిగించేదైనా—చెప్పకుండా ఇలా వచ్చేశాను—ఒక మిత్రుడి వాగ్దానంమీద నమ్మకంతో! ఆ వాగ్దానం చేసిన మిత్రుడి సహా

యంతలోటే ఇక్కడ రెండు వందల రూపా యల ఉద్యోగి నయ్యాను!

నీ కంటిలో చూసుకొబడ్డ నాలో జీవి తాంతం నీ కంటి పాపలా 'మెలగాలనే కోరికే నిబిడీకృతమై యున్నది. జీవితంలో సంపూర్ణ వ్యక్తిత్వంతో ముందడుగు వేయటానికి చేయూత నిచ్చిన నీవు ఒక్క అన్నయవే గాదు— తండ్రివి, దైవానివి!

వదినకు, అక్కకు నమస్కారాలు.

త్వరలోనే అక్క జీవితానికి ఒక వెలు గును ప్రసాదించగలమనే ధైర్యం నాకున్నది!

ఉంటా! నీ ఆరోగ్యం జాగ్రత్త.

నీ తమ్ముడు,
ప్రకాశం".

అంతవరకు చీకట్లు క్రమ్ముకున్న తన మనస్సును ఎవరో బయటకు లాగినట్లని పించింది. తనువడ్డ తొందరపాటుకు చింతి ల్లాడు.

నిజంగా ప్రకాశం, సుందరం—ఇద్దరూ తనకు రెండు కళ్లే!

—త్వరలో తన తమ్ముడు వ్రాసినట్టుగా సుందరాన్ని గూడా ఒక ఇంటిదాన్ని చేస్తే తను మరింత తేలిక పడగలడు.

మనిషిని అసంతృప్తిలో తృప్తి ఆవరించగా కళ్లు కాంతివంతమయినయి. సంపూర్ణ ఆరోగ్యవంతుడిలా కుర్చీలోనుండి లేచి లోపలికి నడిచాడు వడి వడిగా.

సుందరాన్ని గుండెలమీద జేర్చుకొని ప్రేమ పొంగి పొరలుతుండగా తల నిమరా లనిపించింది—"సుందరం!"

* * *

## చల్లని ఎండ

తమ్ముడు ప్రకాశం పంపే డబ్బు యాభై నుండి ఎనభైకి మారింది.

గుండె జబ్బుతో బాధపడుతున్న ఆయన ఒకనాడు గుండెజబ్బుతో బాధపడ్డవాడవ్వ టంతో—అలాంటి నలుగురికి సలహా లిచ్చే టంతటి వాడయ్యాడు!

తిరిగి బడిలోపడే యాభైరాళ్లు చేతులో పడసాగినయి.

తమ్ముడు, చెల్లెలు పట్టుపట్టటంతో ట్యూషన్లకుమాత్రం దూరమయ్యాడు.

—ఇదంతా జరిగేటప్పటికి సుందరంకి మరింత యవ్వన మొచ్చింది. ఆమె మొఖం మరింత మిసమిసలాడింది. ఆమె తలకట్టు మరింత వింతసోగలు పోసాగింది. ఆమె ఆలో చనల పరిధి విస్తృతమయింది. ఆమె మరో ప్రపంచం నిర్మించుకుంది—

అందుకే ఒకనాడు—పెండ్లివారు వచ్చి సుందరాన్ని చూచి, సూచనప్రాయంగా తమ అంగీకారాన్ని తెలియబరిచి వెళ్లిననాడు, తెల్లవారి లేచిచూస్తే—ఆయన కండ్ల ముందు దిండు ప్రక్కగా 'ఆటంబాంబు' లాంటి ఒక కాగితం కనబడింది.

దానిని చేతిలోకి తీసుకొని చదివి— గుండె పోటువచ్చినట్టుగా గిలగిలలాడి పోయాడు.

అది సుందరం వ్రాసిపెట్టింది. అందులో ఇలా ఉంది.

"అన్నయ్యా!

మానవుడు హితాహితజ్ఞానాన్ని కోల్పో తున్నాడంటె కారణం కోరికలే. అవె మని షిని మరో ప్రపంచంలోకి లాక్కువెళుతు న్నాయి. అవే నన్నూ తండ్రిలాంటి నీకు దూరంచేసి మరొకరి దగ్గరకు చేరుస్తున్నయి.

నన్ను కోరికల బలహీనత ఆవరించగా ఈ పెంకుటింట్లో ఎన్నాళ్లు ఉండగలనను కున్నాను. అందుకే మేడను కోరుకున్నాను. ఎక్కడకు వెళ్లవల్సినా కాలినడకే ప్రాప్త మయిన నాకు కారుమీద మోజుబోయింది. కూపస్థమండూకంలాంటి ఈ పల్లెనుండి స్వేచ్ఛావిహంగంలా ఎగిరిపోతున్నాను.

అందుకే శేఖరంతో (ఆయనెవరో నీకు తెలుసు) నన్ను నేను అలంకరించుకున్నాను. నన్ను హృదయపూర్వకంగా ప్రేమించిన ఆయన్ను సర్వస్వంగా నమ్మి ఆహ్లాదనగా ఏర్పరుచుకున్నాను.

అన్నయ్యా! కన్నకూతురులాంటి నాకు నీ ఆశీస్సులు గూడా దొరకవేమోనని భయంగా ఉన్నది. బాధగా ఉన్నది. కంట్లో నీరు గిరున తిరుగుతున్నది.

నన్ను క్షమించలేవూ? పూర్వంలాగానే నీ చల్లని చూపులు ఎల్లప్పుడూ నామీద ప్రస రింపజేస్తుండలేవూ?

ఇట్లు
నీ ప్రియసోదరి
సుందరం."

తను పెద్దగా అరిచి కూలిపోయాడు.

తనను తిరిగి గుండెజబ్బు 'నేను ఉన్నా నంటూ' చెప్పి మరీ దావున జేరింది!

"సుందరం!"


* * *

తరువాత కొద్ది రోజులకే ఒకరోజు సాయంత్రం టపాలో తమ్ముడి దగ్గరనుండి వచ్చిన మనియార్డరు తీసుకుంటూ క్రింద వున్న కూపన్ చదివితే—"అనుకోకుండా ఒక కారు ప్రమాదంలో నాకు కుడిచేయి పోవాల్సి నంత ఘోరం జరగగా—బొటనవ్రేలు పోగొ ట్టుకొని బయటపడ్డాను.... భయపడవద్దు" అంటూ కనబడింది.

కష్టాలన్నీ ఒక్కసారే తనమీద దండెత్తి న్నట్లు విలవిలలాడిపోయాడు. 'వెంటనే వచ్చి ఒక పదిరోజులు ఉండివెళ్లమంటూ' ఎక్స్‌ప్రెస్ డెలో కార్డురాసి తిరిగి జాబుకోసరం ఎదురుచూస్తూ కూర్చు న్నాడు.

కాని తమ్ముడినుండి వచ్చిన జాబు కొంత వరకు తృప్తి కలిగించినా, మానసికంగా శాంతిని పొందలేకపోయాడు.

"ఇంతలోనే గాభరా పడవల్సిన అవసరం



ఏపీ లేదన్నయ్యా......అయితే రాయటానికి కుడిచేయి పనికిరాకపోవటంతో ఎడంచేత్తో ఉద్యోగం చేయవల్సివస్తోంది...... అంతకు మించిన ఇబ్బంది నాకేవీ కలగటంలేదు..... నేను సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నాను..... ఆదుర్దా పడవద్దు......సెలవు దొరకగానే ఆలస్యం లేకుండా నీ దగ్గరవచ్చి వాలగలను" ఇదీ తమ్ముడు వ్రాసిన ఉత్తరం.

రెండు వందల మైళ్ల దూరంనుండి వచ్చిన ఉత్తరం!......తమ్ముడు ఎడంచేత్తో ఇప్పుడిప్పుడే నేర్చుకుంటున్న వ్రాతతో వ్రాసిన ఉత్తరం!

దానికి సమాధానం అన్నట్లుగా,"ఆరోగ్యం మీద కొన్ని హితబోధలు, రోడ్డుమీద నడిచేటప్పుడు పాటించవలసిన విధులు" మొదలైనవాటిని ఆరు కాగితాలమీద ఒక వ్యాసంగా వ్రాసి పంపుతూ సుందరిని గురించి ఈవిధంగా వ్రాశాడు.

"సుందరాన్ని ఎలా నాకంటిపాపగా చూచుకున్నానో నీకు తెలుసు! దానిని మన వంశ ప్రతిష్ట అభివృద్ధి పరిచే రత్నంలాగా ఎన్నుకున్నాను......కాని జరిగింది దానికి పూర్తిగా వ్యతిరేకమే......నీవు నమ్మలేవు తమ్ముడూ! అది ఒక నీచమయిన పని చేసి మన వంశానికే కళంకం తెచ్చింది. నాకు గుండెపోటు తిరిగి తెప్పించింది.....ఛీ! దౌర్భాగ్యురాలు.... మనవీధి చివరనున్న శేఖరంగాడితో సిగ్గు, లజ్జ విడిచి పారిపోయింది......ఇక దాని పేరు ఎత్తితేనే నాకు అసహ్యమేస్తోంది!"

దానికి తమ్ముడు వ్రాసిన సమాధానం తనకు విభ్రాంతి కలిగించింది!

"ఆశాజీవి అయిన మరోమానవుణ్ణి మనం అదుపులో పెట్టగలం అనేది వగటికలే అన్నయ్యా! పితృవాత్సల్యంతో గూడిన నీ చల్లని చూపుల ఆచ్ఛాదనలో తిరగలేనిదాన్ని నిందించి ఏం లాభం? నీ లోని బాధ నాకు తెలుసు......నీలోనేగాదు....నీకంటే గూడా నేను అమితంగా బాధపడుతున్నాను!.... కాని.....కాని.....ఇంతకంటే ఈ భూమ్మీద వున్న నాలుగు రోజులు సుఖమయమయిన జీవితాన్ని గడపగలుగుతుందేమో?.... దాని ఉద్దేశ్యంలోని ఆ 'అదృష్టాన్ని' మనం ఎందుకు లాక్కోవాలి?......నా భావాలు ఇలా ఉన్నందుకు క్షమిస్తావుగదూ?"

ఈ ఉత్తరం చూచిన తరువాత తమ్ముడి మీద గూడా కొంత వెగటు వేసింది...... తమ్ముడేగాదు......ప్రపంచం అంటేనే వెగటు వేసింది....'ఛీ! ఛీ!.....ఈ లోకానికి ఏలాంటి పిదపకాలం పుట్టింది?—' అనుకున్నాడు.




సుఖ స్వప్నములు
వుడ్‌వార్డ్స్ కు
ధన్యవాదాలు!

కడుపునొప్పి. పుల్లదనం. కడుపు ఉబ్బరం. పళ్లువేయునపుడు కలిగే జబ్బులకు. వాడేది
వుడ్‌వార్డ్స్' గ్రైప్ వాటర్




తెలివైన తల్లులు
100 ఏళ్ల నుంచి వాడుచున్నారు.

Aiyars ATC-508 TED

పండిత
డి. గోపాలాచార్యులుగారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
అయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు-17

పుస్తకములు
5 పుస్తకముల పెట్టె రు. 8-50.
(1) కొక్కోకశాస్త్రం (2) సుహాగ్‌రాత్ (3) చుంబన పద్ధతులు, (4) 84 ఆసనములు, (5) రహస్యఫోటో ఆల్బం. ఒక్కొక్క పుస్తకం రు. 2/-. పోస్టేజి, ప్యాకింగ్ అదనం. ఇంగ్లీషులో వ్రాయండి.
ARHANT BOOK DEPOT,
26, ALIGARH (U. P.)

ఉత్తమశ్రేణి సెక్సు పుస్తకాలు
(పెద్దలకు మాత్రము)
సెక్సు అట్లాస్ - (అమెరికన్ ప్రచురణ) 325 చిత్రపటములతో రు.5/-; కోకశాస్త్రము 88 చిత్రపటములతో రు. 5/-; వివాహ జీవితం 100 చిత్రపటములతో రు.5/- 60 వడకగది ఫోటోలు రు. 6/-. పోస్టేజి రు. 1-25 అదనం. పూర్తి మొత్తం M. O. ద్వారా పంపవలెను. వి. పి. పి. లేదు.
VANDANA BOOK DEPOT
RafatGanj.Aligarh(UP) (AP2)

తంతి నంది ట్రేడ్‌మార్కు
NANDI
ఫోన్. 245 రిజిష్టర్డు. 192718
అందమునకు ఆనందమునకు గ్యారంటీకి అసలుబంగారు రేకు కవరింగ్ చేయబడిన
"నంది" ఆభరణములు

నంది గోల్డు కవరింగ్ వర్క్సు
చిలకలపూడి. మచిలీపట్నం.2. ఇండియా.

# చల్లని ఎండ

అనాటినుండి సుందరాన్ని మర్చిపోవటానికి ప్రయత్నించసాగాడు!

కాని....ఆ వూరు....వూళ్లోని వ్యక్తులు తనని వదిలితేనా?

తల ఎత్తుకోలేకపోయాడు. రోడ్డుమీద నడవలేకపోయాడు....దొంగలా చాటు చాటుగా తిరగసాగాడు.

"ఛీ! ఛీ!.... దౌర్భాగ్యురాలు!" పదే పదే అనుకున్నాడు.

తన శరీరం గుండె జబ్బుకు స్థిరమైన ఆచ్ఛాదన ఇచ్చింది. స్కూల్లో మానసిక కల్లోలంతో అంటీ అంటనట్లు పాఠాలు చెప్పసాగాడు—అటు అధికారుల ఆగ్రహానికీ గురవుతున్నాడు!

తమ్ముడినుండి ఉత్తరాలు వస్తూనేఉన్నాయి.

"అన్నయ్యా! నీవు వెంటనే ఆ ఉద్యోగం మానివేయి....ఎందుకు ఈ స్థితిలో గూడా లేనిపోని ఆరాటం?..... అనుకోకుండా నాజీతం యాభై రూపాయలు పెరిగింది. ఈనాడు నేను రెండువందల యాభై రూపాయలు సంపాదించగలుగుతున్నానంటే అది నీ 'భిక్ష' గాదా?.....అటువంటి నిన్ను—ఈ స్థితిలోవున్న నిన్ను—నేను పోషించలేననే నీ అనుమానమా? భయమా?..... వద్దు అన్నయ్యా! వెంటనే ఆ ఉద్యోగం మానేయ్!"

అలాంటి తమ్ముడి ఉత్తరం చూచినప్పుడల్లా కళ్లు కృతజ్ఞతతో మెరుస్తుంటయి!

—యాభై సంవత్సరాలయినా దాటని తను ఇప్పటినుండే వాడి నెత్తిన ఎక్కి ఎలా కూర్చోగలడు?

రేపు వాడికిమాత్రం?—వివాహం చేసుకోవాలి......భార్య వస్తుంది.... పిల్లలు పుడతారు......తన సంసారాన్ని గాకుండానే..... జీవితాంతం తన అన్నయ్య సంసారాన్ని గూడా ఏలా ఏలా మోయగలడు?

అసలు ఎందుకు మోయాలి?

అంతేగాదు—

తన తమ్ముడి తత్వం తనకు తెలిసినా—ఆ రాబోయే అతడిగాడి భార్య.....వద్దు! వద్దు!......మరొకరి పంచన..... తను వూహించలేడు!

ఒక్కసారి విసురుగా తల విదిలించి దృఢంగా కుర్చీలో అంటుకుపోయి శూన్యంలోకిచూస్తూ పడుకున్నాడు!

*  *  *

సుందరం అక్కడ పెట్టివెళ్లిన డబ్బు పెట్టెను చూస్తుంటే ఆయన కళ్ళు పదే పదే తిరుగుతున్నాయి!

అది ఎందుకు ఇచ్చివెళ్లిందా డబ్బు?

తనమీద జాలితోటా?

తనను పెంచి పెద్దచేసినందుకుగాను ప్రతిఫలం ముట్టజెప్పిందా?

ఆ డబ్బు ఇవ్వటంలో దాని ఉద్దేశ్యమేమిటి?

—తన బీదతనాన్ని వెక్కిరిస్తూ, ఆ పాపిష్టి శేఖరంగాడి డబ్బుతో తను చేసిన పనిని కప్పిపుచ్చుకోవటానికి—తనమీద విదిలించిందా?

"ఛీ! ఛీ!... దౌర్భాగ్యురాలు!"

ఎవడికి కావాలి ఆ వెధవ డబ్బు?—ఆ డబ్బు లేందే తను బ్రతకలేడా? చచ్చిపోతాడా?.....అసలు ఆ దౌర్భాగ్యురాలు ఇచ్చే డబ్బుతో జీవితాన్ని అనుభవించేదానికంటే చచ్చిపోవటమే మేలు!

—ఉహూఁ.....తనెందుకు చావాలి?

తనకు ప్రకాశం ఉన్నాడు.....కోటలాంటి ప్రకాశం తనను ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నాడు. తనను నెత్తిన పెట్టుకు పూజించేందుకు ఆతురతపడుతున్నాడు.

ఆలోచనా ప్రవంతుల నడుమ సుందరం అందమైన మొఖం వికృతరూపంలో గోచరించగా బంగారు గ్లాసులో విషం పొంగసాగింది.

ద్వేషంతో, క్రోధంతో, చికాకుతో మనిషి వూగిపోసాగాడు.

ఈనాడే గనుక అది తనకంటిముందుకు వచ్చివుంటే దాని గొంతు పిసికి చంపి ఉండేవాడు.....అలాంటి పని చేసిన వాళ్లకు 'శిక్ష' అదేనని నిరూపించిఉండేవాడు.

ఛీ! ఛీ!

సిగ్గు, లజ్జ లేకుండా తన ఇంట్లో తిరిగి కాలుపెట్టటానికి ఏలా మనస్కరించింది?

నిప్పులాంటి అన్న ఇంట్లో ఏలా కాలు పెట్టగలిగింది?

డబ్బుపెట్టి మనుష్యులను, మనస్సులను కొందామనుకున్నదేమో?

ఆ డబ్బు ఎవడిక్కావాలి?

మొఖాన విసిరి పారవేస్తేసరి?

కళ్లు రక్తవర్ణం దాల్చినయి.

ఎదురుగ్గావున్న ఆ డబ్బునుకాల్చి బూడిద చేయాలన్నంత ఆవేశ మొచ్చింది. లేచి వడివడిగా ఆ పెట్టెవద్దకు నడిచాడు.

"తీసుకువెళ్లి బావిలో పారేస్తాను! దీన్ని ముట్టుకున్న నా చేతులు కాల్చుకున్నా తిరిగి పవిత్రమవ్వవు!"

మనిషి కోపంతో ఊగిపోసాగారు.

చేతిలోని నరాలు పెళపెళమనేలా బిగించి పెట్టెను పట్టుకున్నారు.

ఇనప పూచల్లాంటి కాళ్లతో దొడ్డి వైపుకు అడుగులు వేయసాగారు.

భావిలో పడేస్తే—కాల్చి బూడిదచేస్తే దాని కెలా తెలుస్తుంది?—దాని నికృష్టపు డబ్బును తిరస్కరించానని దాని కెలా తెలుస్తుంది?

అవును!—దానికి తెలియదు!— కాక దొంగా తను స్వీకరించి, అనుభవిస్తున్నానని గూడా అనుకొని సంతోషపడుతుంది. తన ఓటమినిచూసి వెక్కిరిస్తుంది.

ఛీ! ఛీ!

తనని దానికే మొఖం వాచేలా తిప్పి పంపాలి!

తన అన్న ఏలాంటివాడో నిరూపించాలి. తన అన్న దుష్టశక్తులకు ఎలా తలవొగ్గడో అది తెలుసుకు తీరాలి—తన అన్నకు ఏలాంటి తమ్ముడున్నాడో, చెల్లెలు చేసినట్లుగా ఏలా మోసం చేయలేడో గూడా చెప్పాలి!

ఆ ఆలోచన రాగానే కాళ్లు వాటంతటవే ఆగిపోయినయి.

అది ఎక్కడున్నదని తిప్పిపంపగలడు?

దాని అడ్రసు తనకు తెలియదు. కనీసం ఏవూళ్లో పడి ఏడుస్తున్నదో గూడా తనకు తెలియదు—అంతదాకా ఎందుకు—ఈనాటి వరకు అది బ్రతికివున్నదో, చచ్చిందో గూడా తనకు తెలియదు!

క్షణం తన ప్రయత్నం విఫలమవుతుందే మనపించగా-మొఖమంతా చెమట పట్టింది—శ్వాస ఆగిపోయినట్లుగా బిగుసుకు నిల్చున్నాడు.

చటుక్కున ఒక ఆలోచన మదిలో మెదిలింది. కళ్లు రవ్వంత వెలుతురును పులుకున్నయి.

ఇంత డబ్బు పెట్టింది—అందులో చిన్న ఉత్తరం ముక్కయినా పెట్టదా?......దానిలోనన్నా అది ఎక్కడ ఉండేది తెలుసుకునే ఆధారం దొరక్కపోతుందా?

క్షణంలో పెట్టెవాల్చి మోకాళ్లమీద కూర్చుంటూ పెట్టెమూత తీశారు. అందులో పేర్చివున్న గుడ్డ పొరుగులో చేయిపెట్టి తడిమారు.

ఆయనకళ్లు కాంతివంతమయినయి! ఏదో విజయం సాధించినట్లుగా ఉప్పొంగిపోయారు. చేతిలో కాగితం తగిలింది. వణికే చేతులతో బయటకు లాగారు.

ఒక్కసారిగా కళ్లు చించుకు చూచారు.

"అన్నయ్యా!

నా నమస్కారాలను నీవు తిరస్కరించవనే నా ఆశ. అంతేగాదు. ఈ ఉత్తరం ఆసాంతం హేయమైన చూపులతోనైనా ఒక్కసారి చూస్తావనే నా ఆశ! నీ చల్లని హృదయంలో సోదరి బింబాన్ని తుడిచి వేసుకున్నా ఒక దీనురాలి ఆవేదనగా నా యీ మాటలను అర్థం చేసుకుంటావనే నా ఆశ!

'సుందరం' అని నీ నోటినుండి వెలువడే తియ్యని పిలుపును ఎందుకు దూరం చేసుకున్నానో నీకు ఇదివరకే వ్రాశాను—నిజం! జీవితంలో నారెన్నడూ నన్ను 'సుందరం' అని ఒక్కసారి గూడా పిలవ్వని నాకు తెలుసు!.....అందుకే మరెవ్వరిచేత గూడా 'సుందరం' అని పిలిపించుకోవటంలేదు నేను!

సుందరం చచ్చిపోయింది—సుందరి జన్మించింది!

---

ఒక బౌద్ధ భిక్షువును ఒక సమావేశానికి సభాపతిగా ఉండమని కోరారు.

"అయ్యా! నేను ఆజన్మ బ్రహ్మచారిగా ఉంటానని శపథం చేశాను. ఇప్పుడు నన్ను సభకు పతిని చెయ్యడం నా దీక్షకు భంగం కాదా?" అన్నాడు.

పమిడిపాటి గోపాల క్రిష్ణమూర్తి (మద్రాసు)

---

ఊహూ......అదంతాపోనీయ్ అన్నయ్యా!

గతాన్ని తవ్వుకుంటూ కళ్లను బరువెక్కించుకోవటం దేనికి?

చచ్చినవాళ్లు తిరిగి ఎన్నడూ, ఎవరూ ఎలా బ్రతకలేరు—ఈసుందరీ అంతే — సుందరం మరిలేదు!

అసలు సంగతి కొస్తాను......

ఆరోజు నాకు బాగా గుర్తుంది—

నేను పెండ్లిచూపులకు మీ అందరి బలవంతాన తెలియని ఒక యువకుడి ముందు కళ్లను నేలకు అప్పజెప్పి నా వూహలతో నేను కూర్చున్నరోజు—

జీవితంలో స్వర్గ సౌఖ్యాలు కావాలో—చీకటి దినాలే కావాలో (మా ఉద్దేశ్యంలోనే సుమా) కోరుకొమ్మని సరిగ్గా ఆరు గంటలు వ్యవధి ఇచ్చి శేఖరం వెళ్లినరోజు—

నేను ఆలోచనా వెల్లువలో కొట్టుకుపోతూ, ఒక కాలు ఆ గడపమీదా, ఒకకాలు ఈ గడపమీద పెట్టుకొని—ఏదీ ఇదమిద్ధంగా తేల్చుకోలేక—తుక తుకలాడిపోతున్న మనస్సుతో ఆవేదన పడుతున్న రోజు—

ఏం చేయాలి?

ఇటు అన్నయ్య, వదిన, వంశం, పేరు ప్రతిష్టలు—అటు హృదయానికి హృదయమిచ్చిన శేఖరం, బంగళాలు, కార్లు, టెర్లిన్ చీరెలు...... ఓహ్!

వాకిట్లో కొచ్చాను. లోపలి కెళ్లాను. గదిలో కూర్చున్నాను. దొడ్లో మల్లె పందిరి క్రింద నిల్చున్నాను. గభుక్కున భావిలో దూకుదామనుకున్నాను—అర్ధరాత్రి అనుకున్నట్లుగా శేఖరంతో పారిపోదామనుకున్నాను.

అటువంటి సమయంలోనే వాకిట్లో సైకిల్ గంట మ్రోగింది.

టెలిగ్రాం!

తమ్ముడు ప్రకాశం కారు ప్రమాదంలో చచ్చిపోయాడంటూ—టెలిగ్రాం!

టెలిగ్రాం అన్నయ్యా!—తమ్ముడు చచ్చిపోయాడు!!

భోరున ఏడ్చాను.

నీవు ఇంట్లోలేవు. వదిన వంటఇంట్లో ఎక్కడో ఉన్నది. ఏం చేయాలో తోచలేదు. కాళ్లు చేతులు వణుకుతున్నాయి. అడుగులో అడుగు వేసుకుంటూ—తూలుకుంటూ లోపలికి వస్తుంటే లక్ష ప్రశ్నలు నన్ను చుట్టు ముట్టినయి!—

ఇక మన గతేమిటి?—ఈ సంగతి తెలుసుకున్న నీకు తిరిగి గుండె జబ్బు రాదన్న హామీ ఏమిటి?

లెక్కలేనన్ని ఆలోచనలు, సమాధానాలు, ప్రశ్నలు, అర్థం పర్థంలేని సమస్యలు—నన్ను చుట్టుముట్టినయి. తుపానులోకి త్రోసివేసినయి—కాని అన్నిటికి చిట్టచివరకు నేను ఎన్నుకున్న సమాధానమే నచ్చింది! నా గుండె బిగుసుకుపోయింది. ఆ రాత్రి పన్నెండుగంటలకే మీరంతా పడుకొని నిద్రపోతుండగా ఈ సుందరం చచ్చిపోయింది—తమ్ముడు ప్రకాశం చచ్చిపోయాడన్న ఘోర నిజాన్ని కడుపులో పెట్టుకొని—సుందరి శేఖరంతో పారిపోయింది!

అర్థం అయిందా అన్నయ్యా!—ఇదంతా నిజం!.....పచ్చినిజం!!

ఆనాటినుండి ప్రకాశం—ఎడం చేత్తో వ్రాసే ప్రకాశం—ఈ సుందరే అయింది! కాని ఎన్నాళ్లు ఈ నిప్పును మ్రింగి ఉండగలను? ఎన్నాళ్లు నీకు తెలియకుండా ఈ బాధను భరించి ఉండగలను?

—అందుకే ఈ నాటకమైనా బయట పడవల్సి వచ్చింది!

నాలోని వూహా హార్మ్యాలన్నిటికి పునాదులువేస్తూ అందమైన భవంతులనే నిర్మిస్తున్న శేఖరం సలహా సహకారాలతో ఈ విషయం బయట పెట్టగలిగాము! ఈనాటి కైనా!

అన్నయ్యా! బుద్బుద ప్రాయమైన ఈ జీవితంలో మనం ఎన్నో— ఊహా.....



నేను నీకు చెప్పదగ్గ దాన్నిగాదు......నేను చిన్న పిల్లను.....ఏమీ తెలియని దాన్ని.....లోక జ్ఞానంలేని అజ్ఞానురాల్ని... స్వార్థం తప్ప... ఊహా......ఇంకేం వ్రాయనన్నయ్యా?

'చెక్కు'ను చింపివేసినంత తేలిగ్గా డబ్బును చింపివేసే ఇలా వచ్చి ఇవ్వటం జరిగింది— అంతేగాదు నీవు తిప్పి పంపితే నా ప్రాణమే పోతుంది గనుక— నా చిరునామా గూడా నీకు తెలియనీయటంలేదు!

నీ నిర్ణయాన్ని ధిక్కరించి నీ గడపలో కాలు పెట్టినందుకు నన్ను క్షమిస్తావు గదూ?

వదినకు హృదయపూర్వక నమస్కారాలు అందజేయి.

ఇట్లు,

ఈనాటికీ, ఏనాటికీ గూడా నీ చెల్లెలే

అయిన సుందరం." ★


అతన్ని ముద్దుగా నవ్వించండి.....

అంతాచేసి మూడారే. ఇంతలోనే ఆరు పళ్లు వచ్చేశాయి ఎంతో సరదాగా వున్నాడు. ఆరోగ్య సూచకమైన ఆకలి, గాఢ నిద్ర పోతాడు. కాని కడుపునొప్పి, అది తగ్గడం ఎంతో సేపు కాదు లెండి.

బేబీ టోన్
గ్రైప్ మిక్శ్చర్ కు ధన్యవాదాలు.

ABC వారి ఉత్పత్తి

బేబీటోన్
గ్రైప్ మిక్శ్చర్
BABYTONE GRIPE MIXTURE




స్టాకిస్టు:
అమర్‌చంద్ శోభాచంద్ పోస్టు బాక్స్ 518, మద్రాసు-3.